క్లుప్తంగా

నేటి నుంచి ఉత్సవాలు



నారాయణపేట రూరల్ : మండలంలోని సింగారం గ్రామంలో స్వయంభుగా వెలిసిన చింతలరాయస్వామి జాతర బుధవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. మొదటిరోజు ఆలయశిఖర ప్రతిష్ఠాపన, కుంభాభిషేకం, పల్లకీసేవా, ప్రభోత్సవం, అన్నదానం ఉంటాయన్నారు. రెండోరోజు అభిషేకం, మహానైవేద్యం, ఉద్దాలసేవా, రథోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

దుస్తుల పంపిణీ



కోస్గి: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ చేయూతనందిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం రంజాన్ మాసం సందర్భంగా ఇమామ్, మౌజంలకు ఎమ్మెల్యే అందించిన దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బాలేష్, మాస్టర్ శ్రీనివాస్, నాయకులు అహ్మద్, పాష, అజీజ్, దుద్యాల్ జావీద్, వాహబ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి'

నారాయణపేట టౌన్ : రాష్ట్రంలో పరీక్షలంటే లీకేజీలకు, పైరవీలకు అమ్ముకోవడానికి కేరాఫ్‌గా మారిపోయాయని బీసీసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాల్‌రాజ్ యాదవ్ ఒక ప్రకటనలో మంళగవారం ఆరోపించారు. పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని బీఆర్ఎస్ పరిపాలన కొనసాగడం విద్యార్థుల దురదృష్టమన్నారు. పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ వెంటనే విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

కనులపండువగా రాములోరి కల్యాణం

అమరచింత: ఆత్మకూర్ మండలంలోని వీరరాఘవపురంలో మంగళవారం సీతారాముల కల్యాణ మహోత్సం కనులపండువగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం త్రయోదశి రోజు గ్రామంలోని ఆలయంలో రాములోరి కల్యాణం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజంపేట నియోజకవర్గంలోని ఒంటిమిట్ట ఆలయంలో ఇదే రోజు రాములోరి కల్యాణం నిర్వహిస్తారని.. అదే ఆచారం ప్రకారం గ్రామంలో ప్రతి ఏడాది ఇదే రోజు నిర్వహిస్తామని సర్పంచ్ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోటేశ్వర్, ఉప సర్పంచ్ శారద, సింగిల్ విండో చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి, మాజీ చైర్మన్ మాధవి, ఆరెపల్లి సర్పంచ్ అనసూయ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

అమరచింత: ఫైలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు రక్త పరీక్షలను నిర్వహిస్తుందని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ శరత్ అన్నారు. ఆత్మకూర్ మండలంలోని పిన్నంచర్ల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఒకటి, రెండు తరగతులు చదువుతున్న చిన్నారుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఈసందర్భంగా డాక్టర్ శరత్ మాట్లాడుతూ జాతీయ ఫైలేరియా నివారణ కార్యక్రమంలో భాగంగా ఫైలేరియా వ్యాధి వ్యాప్తి తీవ్రతను గుర్తించే ట్రాన్స్‌మేషన్ అసెస్మెంట్ సర్వేలో భాగంగా పాఠశాలలకు వెళ్లి చిన్నారులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్వే ద్వారా సమాజంలో ఫైలేరియా వ్యాధి ఏస్థాయిలో ఉందో తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపధ్యాయుడు, ల్యాబ్ టెక్నీషయన్ రాజు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎస్ఎం హైమావతి పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే క్షయ నివారణ

అమరచింత: అప్రమత్తంగా వ్యవహరించి తగిన ఆరోగ్య సూచనలు పాటించడంతో త్వరితంగా క్షయ నుంచి కోలుకునే అవకాశం ఉందని డాక్టర్ శరత్ అన్నారు. పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డీఎంఆర్ఎం ట్రస్టు ద్వారా క్షయ వ్యాధిగ్రస్తులకు మంగళవారం పౌష్టికాహారం అందించారు. ఈమేరకు మార్కెట్ చైర్మన్ ఎస్ఏ రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్రతి నెల క్షయ వ్యాధిగ్రస్తులకు డీఎంఆర్ఎం ట్రస్టు ద్వారా ఉచితంగా పౌష్టికాహారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నిసార్ అహ్మద్, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, రెడ్‌క్రాస్ జిల్లా ఉపాధ్యక్షుడు కలాంపాషా, జిల్లా కమిటీ సభ్యుడు శ్యామ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పూర్తయ్యేనా?

- ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నా స్పందించని అధికారులు
- స్వచ్ఛందంగా స్థలాలు వదిలి అవస్థలు పడుతున్న ప్రజలు



పేరుకుపోయిన ఇళ్ల వ్యర్థాలు



కాల్వలు పూడుకుపోయి రోడ్డు పై పారుతున్న మురుగు

దామరగిద్ద: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి సంజీవరాయ ఆలయం వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా మారాయి. కొందరు అధికారుల నిర్లక్ష్యంతో పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. రోడ్డు విస్తరణ కోసం ఇరువైపులా ఇళ్లు ఉన్న వారిని ఏడాదిగా ఒప్పించి మెప్పించి స్వచ్ఛందంగా వదులుకునేలా కృషిచేసిన ప్రజాప్రతినిధులకు అధికారుల పనితీరు తలనొప్పిగా మారింది. ప్రజాప్రతినిధులు పనులు పూర్తిచేయాలని అధికారులను పదేపదే కోరుతున్నా పట్టించుకోవడం లేదు. సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు నిలదీస్తారనే ఉద్దేశంతోనే అధికారులు హాజరు కాలేదని పలువురు ఆరోపిస్తున్నారు. వారి నిర్లక్ష్యాన్ని, పనితీరును నిరసిస్తూ సమావేశాన్ని రద్దు చేశామని పలువురు సభ్యులు అంటున్నారు. ఏడేళ్ల క్రితం దామరగిద్ద నుంచి యానగుంది వరకు డబుల్ రోడ్డు మంజూరైంది. 11.5 కిలోమీటర్ల డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.13 కోట్లు ఎమ్మెల్యే చొరవతో మంజూరు చేశారు. కాగా అధికారులు పనులు ప్రారంభించి దామరగిద్ద గ్రామంలో మినహా మిగతా పనిపూర్తి చేశారు. గ్రామంలో కేవలం 700 మీటర్ల రోడ్డు విస్తరణ పూర్తిచేయడానికి మీనమేషాలు లెక్కిస్తున్నారు. మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ కోసం ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి ఇచ్చిన రాతపూర్వక హామీ మేరకు ప్రజలు ఇళ్ల స్థలాలను వదులు కున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా అధికారుల నిర్లక్ష్యం గ్రామస్తుల పాలిట శాపంగా మారింది. గత డిసెంబర్‌లో ఇళ్ల తొలగింపు ప్రారంభించి వదిలేసిన నాటి నుంచి కాల్వలు పూడుకుపోయి రోడ్డుపై మురుగు పారుతోంది. మిషన్ భగీరథ కుళాయిలు పూడుకు పోవడంతో తాగునీరు అందక తంటాలు పడుతున్నారు. అధికారులు ఇళ్లు కూల్చడంతో చూపిన శ్రద్ధ, విస్తరణ పనులు పూర్తి చేయడంలో చూపడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పూర్తిచేయాలని కోరుతున్నారు.

రెండోవారంలో ప్రారంభిస్తాం

స్థానికుల సహకారంతో రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కూల్చివేశాం. పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. బిల్లులు పెండింగ్‌లో ఉన్న కారణంగా నిధులు లేవని ఆలస్యం చేస్తున్నాడు. రోడ్డు పనుల ఆలస్యంపై జిల్లా కలెక్టర్ సమావేశంలో ఆరా తీశారు. ఏప్రిల్ రెండోవారంలో కచ్చితంగా పనులు ప్రారంభిస్తాం.

–రాములు, డీఈ, ఆర్అండ్‌బీ, నారాయణపేట

పనులు చేపట్టడం లేదు



రోడ్డు విస్తరణ కోసం స్థానిక ప్రజా ప్రతినిధులు సూచించడంతో ముందుకు వచ్చి ఇళ్లను తొలగించుకున్నాం. అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇళ్లు కూల్చగా ఏర్పడిన చెత్తను తొలగించడం లేదు. దీంతో డ్రైయినేజీలు పూడుకుపోయి రోడ్డుపై మురుగు పారుతోంది. భగీరథ కుళాయిలు పూడుకుపోయాయి. రోడ్డు పనులు ప్రారంభం కాక పోవడంతో కూల్చగా మిగిలిన ఇంటికి మరమ్మతులు చేసుకోలేక పోతున్నాం. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలి.

– శ్రీనివాస్, దామరగిద్ద

అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు



రోడ్డు విస్తరణ పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వారి పనితీరుతో విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి సమాధానం ఇవ్వలేకపోతున్నాం. ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు పనులలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు, ప్రగతి నివేదికలు ఇవ్వడం లేదు. ఫోన్‌లో సంప్రదించినా స్పందించడం లేదు. దీంతో సోమవారం సభ్యుల ఏకాభిప్రాయంతో వారి పనితీరుకు నిరసనగా సమావేశాన్ని రద్దు చేసుకున్నాం. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడాలి.

–నర్సప్ప, ఎంపీపీ, దామరగిద్ద

చలివేంద్రం ప్రారంభం



నారాయణపేట రూరల్ : జై భవానీ ఫ్రూట్ మర్చంట్ ఆధ్వర్యంలో శివసింగ్ జ్ఞాపకార్థం వారి కుమారులు దేవిసింగ్, చందుసింగ్‌లు స్థానిక కొత్త బస్టాండ్ ఎదురుగా మంగళవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణబట్టడ్ చేతుల మీదుగా ప్రారంభించి ముందుగా మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం కూల్ ఫిల్టర్ వాటర్‌ను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు గందె చంద్రకాంత్, విజయ్‌సాగర్, చెన్నారెడ్డి, ప్రకాష్‌బట్టడ్ పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

నారాయణపేట టౌన్ : దోమలను నివారించేందుకు కమిషనర్ సునీత ఆదేశాల మేరకు మున్సిపల్ కార్మికులు మంగళవారం సాయంత్రం టీచర్స్ కాలనీ, మోనప్ప కాలనీ, గాంధీనగర్, సింగార్‌బేస్, హాజిఖాన్‌పేట, కుర్వగేరి, సివిల్‌లైన్‌లో ఫాగింగ్ చేపట్టారు. ప్రతిఒక్కరూ ఇంటి ఎదుట మురుగు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చెత్తచెదారం మున్సిపల్ చెత్త ఆటోలోనే వేయాలని ఈ సందర్భంగా కమిషనర్ సూచించారు.

కేసీఆర్ ప్రభుత్వంలోనే తండాల అభివృద్ధి



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కోస్గి: నియోజకవర్గంలో గ్రామ పంచాయతీలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసుకొని ఆదర్శ పంచాయతీలుగా మార్చుకుందామని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని కొమ్మూర్, పెద్దతండాలో పలుఅభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలకు హాజరయ్యారు. పెద్దతండాలో రూ.22 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం, రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన వైకుంఠధామంతోపాటు పల్లె ప్రకృతి వనం, హైమాస్ట్ లైట్లను, కొమ్మూర్‌లో సీసీ రోడ్లను స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఎంపీపీ మధుకర్‌రావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వీరారెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మద్దూరు: కేసీఆర్ ప్రభుత్వంలోనే తండాలు గ్రామ పంచాయతీలుగా మారి అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దతండాలో హైమాస్ట్ లైట్లు, స్మశాన వాటిక, పంచాయతీ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ తండా గతంలో వీరారంనకు అనుబంధంగా ఉండేదని అన్నారు. తండాకు బీటీ రోడ్డు వేశామని, గ్రామ పంచాయతీ ఏర్పాటు కావడంతో సీసీ రోడ్లు, పంచాయతీ భవనం, స్మశాన వాటికలు తదితర అభివృద్ధి పనులు చేపట్టగలిగామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, ఎంపీటీసీ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు సలీం, బాల్‌సింగ్‌నాయక్, హన్మిరెడ్డి, వెంకటయ్య, తిరుపతి, వీరారెడ్డి, కిష్ట్యానాయక్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ విమలమ్మ

ధన్వాడ: మండలంలోని మందిపల్లిలో మంగళవారం సీసీరోడ్డు పనులను సర్పంచ్ విమలమ్మ ప్రారంభించారు. మందిపల్లి గ్రామ ప్రవేశం నుంచి పల్లె ఆస్పత్రి వరకు రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. మొత్తం రూ.8 లక్షలతో పనులు ప్రారంభించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ ప్రమీల, కార్యదర్శి శ్రీనివాసులు, రమేష్‌శెట్టి, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సూజాత తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు పరిశీలన

మరికల్: గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి డంపింగ్ యార్డుకు నిప్పుపెట్టడంతో ఘటనాస్థలాన్ని సర్పంచ్ గోవర్ధన్, ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సర్పంచ్ గోవర్ధన్, కార్యదర్శి శ్రీనివాస్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డంపింగ్ యార్డు పూర్తిగా కాలిపోవడంతో రూ.లక్ష వరకు నష్ట వచ్చిందన్నారు. కాగా ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



6న హనుమాన్ శోభాయాత్ర

మరికల్: హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 6న మరికల్‌లో శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఈ మేరకు బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు రాజేష్, యువక మండలి అధ్యక్షుడు రవికిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధిక సంఖ్యలో యువకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నర్వ: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని నర్వ శివారులోని ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 6న ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం 10 గంటలకు స్వామి వారికి పంచామృతాభిషేకం, ప్రత్యేకపూజలు, మధ్యాహ్నం 1 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం శోభయాత్ర ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు అన్నదానం

ఊట్కూరు: హనుమాన్ జయంతి సందర్భంగా ఊట్కూరులోని మెయిన్‌బజార్ హనుమాన్ మందిర్‌లో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బోగిని వెంకటయ్య తెలిపారు. అదేవిధంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని వివరించారు.

నేడు జట్టి హనుమాన్ జాతర



నారాయణపేట రూరల్ : జాజాపూర్ జట్టి హనుమాన్ జాతర ఉత్సవాలు బుధవారం జరగనున్నాయి. తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక భక్తులు పెద్ద సంఖ్యలో ఈ జాతరకు వస్తుంటారు. ముఖ్యంగా సంతానం లేనివారు ఇక్కడ నిర్వహించే యజ్ఞంలో కూర్చుంటే తప్పకుండా పిల్లలు కలుగుతారని నమ్మకం. ఆ విధంగా సంతానం కల్గిన వారు పిల్లలతో వచ్చి బెల్లంతో తులాభారం చేసి ఆలయానికి సమర్పించి మొక్కలు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నారాయణపేట టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ జయశ్రీ అన్నారు. మంగళవారం గాంధీనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు డా. మోనేశ్వర్ చారి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్

కృష్ణా: గూడెబల్లూర్ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దామని తహసీల్దార్ వైపీ రమేష్ సూచించారు. మంగళవారం ఆలయంలో అన్ని శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎస్ఐ విజయ్ భాస్కర్, సర్పంచ్ మహాదేవమ్మ, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీనారాయణ, కొకల్ వెంకటేష్, గ్రామ ప్రముఖులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

రైతుల కళ్లలో ఆనందం చూడాలన్నదే లక్ష్యం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

మక్తల్: వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతుల కళ్లలో ఆనందం చూడాలన్నదే తమ లక్ష్యమని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. అదేవిధంగా భూత్పూర్, సంగంబండ రిజర్వాయర్ల నుంచి సాగునీరు అందించడమే ధ్యేయంగా కృషిచేస్తున్నామని వివరించారు. భూత్పూర్ రిజర్వాయర్ లెఫ్ట్ కెనాల్ ప్యాకేజీ –21 భూసేకరణ పూర్తి అయిన సందర్భంగా కాల్వ పనులు, తవ్వకం, లైనింగ్ పనుల పూర్తి పై అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. పనులను ప్రారంభించారు. నియోజకవర్గంలో ప్రతిఎకరాకు నీరు అందేలా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణకు ఆహ్వానం

నర్వ: మండలంలోని పాథర్చేడ్ గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయనున్న మహాత్మజ్యోతి బాపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాల ఆవిష్కరణకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని నాయకులు, ఉపాధ్యాయులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయనను కలిసి ఈ నెల 11 నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వానపత్రిక అందించామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారని పాఠశాల హెచ్ఎం సూరం వెంకటేష్, ఎంపీటీసీ శ్యాంలాల్, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ రాములు, విండో డైరెక్టర్ పల్లెశేఖర్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహ తదితరులున్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



గురులోకమాసంద్ ఆలయం

మద్దూరు: గిరిజనుల ఆరాధ్య దైవంగా భావించే గురులోకమాసంద్ ప్రభు బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు పూజారులు తెలిపారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో వెలసిన గురులోకామాసంద్ ప్రభు(బావాజీ) బ్రహ్మోత్సవాలు ఏటా చైత్ర శుద్ధ చతుర్థశి నుంచి చైత్ర బహుళ విదియ వరకు నాలుగు రోజుల పాటు నిర్వహిస్తారు. ఉత్సవాల ఏర్పాట్లపై గత నెల 27న కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి వివిధ శాఖల అధికారులతో ఆలయం ఆవరణలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతర జరిగే నాలుగు రోజులు పర్యవేక్షణ అధికారిగా ఆర్‌డీఓ రాంచందర్ వ్యవహరించానున్నారు. ఉత్సవాల్లో సమస్యలపై ఫిర్యాదుల కేంద్రాన్ని ప్రారంభించామని కోస్గి సీఐ జనార్దన్ తెలిపారు. అలాగే షీటీమ్‌లు, మఫ్టీలో పోలీసులు తిరుగుతారని, పోలీస్ పెట్రోలింగ్, ట్రాఫిక్, ఇతర బందోబస్తుకు ఏర్పాట్లు జరిగాయన్నారు. దాదాపు 120 మంది పోలీసులు విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామంలోని ఇళ్లలో ఎవరైనా మద్యం అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఆర్‌డీఓ

బుధవారం నుంచి జరగనున్న ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఆర్‌డీఓ రాంచందర్ మంగళవారం పరిశీలించారు. కొత్తపల్లి తహసీల్దార్ రాణాప్రతాప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చెన్నయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమాల వివరాలు

ఉత్సవాల్లో భాగంగా 05న ధ్వజారోహణం, ప్రభోత్సవం, 06న రథోత్సవం(తేరు), 07న మహాభోగ్, ప్రభువారి పల్లకీసేవ, 08న కాళికాదేవి పల్లకీసేవ, హోమం, పూర్ణ ఆహుతి, మంగళహారతి ఉంటాయని ఆలయ పూజారులు తెలిపారు.

మారెమ్మవ్వ బోనాలు

మాగనూర్: మండల పరిధిలోని బైరంపల్లిలో మారెమ్మవ్వ బోనాల పండుగను గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ మంజుల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువతో సన్మానించారు. జెడ్పీటీసీ వెంకటయ్య, నేరడగం సర్పంచ్ అశోక్‌గౌడ్, ఎంపీటీసీ ఎల్లారెడ్డి, మైపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ నవీన్, గ్రామపెద్దలు పురుషోత్తంరెడ్డి, చిన్నప్ప, నర్సిములు, శంకర్, రాఘవేంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లి ఎల్లమ్మకు పూజలు



లింగంపల్లిలో అమ్మవారికి పూజలు

నారాయణపేట రూరల్ : గ్రామీణ ప్రజల ఆరాధ్యదైవమైన లింగంపల్లి ఎల్లమ్మతల్లిని మంగళవారం భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. రెండు నెలల కింద జరిగిన ఉత్సవాలకు హాజరుకాని వారు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు ఆలయ పరిసరాల్లో ఉడకబెట్టిన అన్నం, వంకాయ, ఉలిగడ్డ కూరలు వండి, నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. కోడి, మేక, గొర్రెలను బలిచ్చి, కల్లును ప్రసాదంగా సేవించారు. గ్రామ పంచాయతీ, ఆలయ పెద్దలు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.

కారు బోల్తా : యువకులకు తీవ్రగాయాలు



బోల్తా పడిన కారు

మరికల్: కారు బోల్తాపడడంతో వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ పక్కన మహేశ్వర మండలం పెద్ద నాగరం తండాకు చెందిన 8 మంది యువకులు కారులో మంగళవారం గోవా వెళ్తున్నారు. మరికల్ మండలం పస్పుల స్టేజీ దగ్గర వెళ్తున్న సమయంలో లారీని ఓవర్‌టేక్ చేయబోయారు. ఈ క్రమంలో ఎదురుగా మరో వాహనం వచ్చింది. తప్పించబోగా కారు అదుపు తప్పి పక్కన ఉన్న పొలంలోకి పల్టీలు కొడుతూ పడిపోయింది. దీంతో రాహుల్, ఆకాష్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

కొనసాగుతున్న పరీక్షలు



పరీక్షలు రాయడానికి వెళ్తున్న విద్యార్థులు

ఊట్కూరు: మండలంలోని నాలుగు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా కొనసాగాయి. మొత్తం 506 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పెద్దపొర్ల, ఎడివెల్లి, మొగ్దుంపూర్ తదితర గ్రామాల విద్యార్థులు ఆటోలు, ఇతర వాహనాలలో పరీక్షలకు హాజరయ్యారు. చీఫ్ సూపరిండెంట్ చంద్రశేఖరయ్య, సత్యనారాయణ, దత్తాత్రేయ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు. కేంద్రాల వద్దఎస్ఐ రాములు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

జోరుగా ఇసుక దందా!



గజ్జరందొడ్డిలో ఇసుక తరలించిన ఆనవాళ్లు

మాగనూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. కొందరూ అక్రమార్కులు మందిపల్లి, గజ్జరందొడ్డి, అడవిసత్యారం, మాగనూర్ గ్రామాల్లోని వాగుల నుంచి నిత్యం ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. మాగనూర్ మండలం పెద్దవాగు పరివాహక గ్రామాల్లో దందా జరుగుతున్నా.. స్థానిక అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలం నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుక తరలుతున్నా పట్టించుకోకపోవడంతో అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దందాపై ఉక్కుపాదం మోపాలని సమీప పొలాల రైతులు కోరుతున్నారు. విషయంపై రెవెన్యూ ఆర్ఐ శ్రీశైలంను వివరణ కోరగా.. ఇసుక అక్రమంగా తరలిస్తున్న విషయం తమ దృష్టికి రాలేదని వెంటనే ఆయా ప్రాంతాలలో వీఆర్ఏలతో డ్యూటీ ఏర్పాటు చేయించి ఇసుక అక్రమ రవాణాను అడుకుంటామని తెలిపారు.